# పట్టు

"నాగన్న పట్టంటే బ్రమ్మ పట్టే! ఈ తొర్రుపట్టులో ఆడు దొంగతనం చెయ్యని యిల్లు లేదు, ఆడిని పట్టుకున్న వాళ్ళు లేరు. అందుకని ఆడికి ఏభై ఏళ్ళు నిండిన ఈ అమాసనాడు *"సర్వగృహ చోరవీర శూర శిఖామణి"* అనే బిరుదు యివ్వాలని ముఠానాయకుడిగా నిర్ణయం తీసుకున్నాను. ఏమంటారు?" అని అడిగాడు బ్రహ్మన్న.

అది పాక కాదు, గుడిసె కాదు. పాక కంటె చిన్నది. గుడిసె కంటె పెద్దది. అంటే పెద్ద గుడిసె అనచ్చు, లేదా చిన్న పాక అనచ్చు. అక్కడే ఓ యాభైమంది గోడమీది బల్లులల్లే చేరి కూర్చున్నారు. అంతమంది వున్నా మిట్ట మధ్యాహ్నపు చిట్టడవి అల్లే నిశ్శబ్దంగా వుంది. బ్రహ్మన్న అడిగిన ప్రశ్నకి అంతా తలలూపారు. కాని చిన్నన్న చిన్నగా మూలిగాడు.

"ఏందిరా నీ గొడవ?" ఉరిమాడు బ్రహ్మన్న. ఆ ఉరుము, లోపల వున్న ఏభైమందికీ తప్ప గడప దాటి ఉడతక్కూడా వినబడదు. "సర్వగృహ చోర వీర శూర శిఖామణి" అంటే ఈడు దొంగతనం చెయ్యని యిల్లులేదు అని కదా అర్థం. మరి యీడు కాశయ్యగారింట్లో దొంగతనం చెయ్యలేదు కదా! ఎట్టా కుదురుతుంది?" కాస్త గట్టిగానే అడిగాడు చిన్నన్న.

అంతా సందేహంగా చూశారు. కాస్సేపాలోచించాడు బ్రహ్మన్న. "ఆ మాటకొస్తే అదే కాదు, నువ్వూ చెయ్యలేదు, నేనూ చెయ్యలేదు. ఎవడూ ఏనాడూ ఆ యింట్లో దొంగతనం చెయ్యలేదు. కాబట్టి ఆ సమస్యే లేదు!".

"అలా అయితే ఏదో ఒక వంక పెట్టి, ఇంకో రెండు మూడు మినహాయింపులు యిస్తే, ఆ బిరుదు నీకూ యివ్వచ్చు, నాకూ యివ్వచ్చు అదు ఆ బిరుదు పుచ్చుకోవాలంటే ఆ యింట్లో కూడా దొంగతనం చేసి రావాలిసిందే" పట్టుబట్టాడు చిన్నన్న.

అందరూ ఆలోచనలో పడ్డారు. బ్రహ్మన్నకేం చేయాలో తోచలేదు. చిన్నన్నని తీసెయ్యడానికి వీల్లేదు. నాగన్న తరువాత అంతటివాడు.

నాగన్న లేచాడు. "సరే! మీరంతా యిక్కడే కూసోండి. తొలి కోడి కూసేలోగా కాశయ్యగారి కాలి కడియం ఎత్తుకొచ్చి మీకు చూపిస్తాను" అంటూ బయటికి నడిచాడు.

అందరికీ గుండె లవిసిపోయాయి. అమ్మో!! కాళయ్యగారి కాలి కడియమే!!! ఆ యింటికి ఏ దొంగా, ఏనాడూ దొంగతనానికి వెళ్ళలేదంటే, కారణం – కాళయ్యగారి తాత తండ్రుల కాలం నుంచీ ఆ ప్రాంతాల పది పదిహేను తొర్రుపట్లకి వాళ్ళే మల్లవిద్యా గురువులు. కాళయ్యగారు మల్లవిద్యలో తాత తండ్రుల్ని మించిపోయాడు. గుది బండైనా, గుండుసూదైనా ఆయన చెయ్యి పడ్డదంటే కదలటానికి వీల్లేదంతే! అదీకాక ఆ యింటి కోడళ్ళు అన్నపూర్ణలు! ఏనాడూ లేదు అని అనలేదు. అమ్మా అని అనకముందే గర్భమైనా – గర్భశత్రువైనా కడుపు నిండా అన్నం పెట్టి మరీ పంపేవాళ్ళు. కాళయ్యగారి భార్య గంగమ్మగారు మరీ జాలిగుండె. ఆ యింటికెలా దొంగతనానికెళ్ళడం? వీటికితోడు కాళయ్యగారికి బండ మెలకువ. చీమ చిటుక్కుమంటే చివ్వున లేస్తాడు. నాగన్న ఎంత గండర గండడైనా ఆ ఊపులో దొరికాడంటే, ఒక్క దెబ్బకి శంకరగిరి మాన్యాలే!.... అందరూ గడగడలాడుతూ కూర్చున్నారు.

నాగన్న నవ్వుకుంటూ నడుస్తున్నాడు. కాళయ్యగారు రోజూ పడుకోబోయే ముందు కడియం తీసి పడగ్గదిలో దక్షిణపు గోడపై మేకుకి తగిలిస్తాడు. ఈ రహస్యం నాగన్నకి తెలుసు ఎలా తెలుసు అని అడక్కండి. అది వాడి వృత్తి ధర్మం.

★ ★ ★

కాళయ్యగారి పడగ్గది దక్షిణపు గోడకి బయట వైపు ఎక్కడ తవ్వితే, లోపల గోడకున్న మేకుకి కిందగా కన్నం ఏర్పడుతుందో, సరిగ్గా లెక్క కట్టి గోడ కింద భాగంలో

అక్కడ తవ్వుతున్నాడు నాగన్న. చీమలు తవ్వుతుంటే అన్నా శబ్దం అవుతుందేమో గాని, నాగన్న తవ్వుతుంటే ఇంతే సంగతులు, చిత్తగించవలెను.

కన్నం పూర్తి అయింది. ఎంత కన్నం? అడ్డెడు తప్పాల పట్టే అంత కన్నం. నాగన్న బియ్యబ్బస్తా అంత మనిషి. పిల్లులూ, కుక్కలూ – తలుపుల కింద నించీ, గోడల సందుల్లోంచీ, తూముల్లోంచి శరీరాన్ని యిలకరిచి, సాగలాగుతూ, పాక్కుంటూ, పీక్కుంటూ దూరతాయి చూడండి. అదిగో అల్లా కన్నంలోంచి లోపలికి దూరాడు. దూరుతూ దీపబ్బుడ్డి వెలుతురులో గదిలోకి చూశాడు. పెద్ద గుమ్మడి కాయల్లే పందిరి మంచం మీద పడుకుని ఉన్నాడు కాళయ్యగారు. ఇంకో చిన్న మంచం మీద కత్తిపీటల్లే పడుకుంది గంగమ్మగారు చటుక్కున నుంచుని కడియం అందుకుని తిరిగి కన్నంలోకి దూరాడు నాగన్న.

అదే క్షణంలో... పిల్లి తరుముకు వస్తున్న ఓ చిట్టెలుక గోడవారగా "రయ్యి"మని పరిగెత్తుకుంటూ వచ్చి కన్నంలోకి దూరింది. దూరి కన్నం గోడకీ, నాగన్న ఒంటికీ మధ్యన పడి కిచ కిచ లాడింది. ఆ నిశ్శబ్ద నిశీధిలో నాగన్న చెవికి "ఆ కిచకిచ" నిష్ఠా వర్షదమోఘ మేఘపటలీ నిర్గచ్ఛద్ఘన ధనార్భటీ విస్ఫోటనమల్లే వినబడి హడిలిపోయి శరీరాన్ని మరికాస్త కుచించాడు. ఎలుక పారిపోయింది. వెంటనే ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ముందరి శరీరాన్ని వాయువేగంతో ముందరికి తోసేశాడు. వెనక శరీరాన్ని కూడా మెరుపు వేగంతో లాగేశాడు, కాని – లోపల మిగిలిన కుడి పాదం తాలూకు బొటన వేలు మాత్రం దేనికో పట్టుకుని యిరుక్కు పోయింది "అయిపోయామురా భగవంతుడా" అనుకుని బలం అంతా కూడ గట్టుకుని కాలు ఒక్క ఝాడింపు ఝాడించాడు. మామూలుగా అయితే ఆ ఝాడింపుకి ఓ అడివి పందో, ఎలుగొడ్డో ఎగిరి అవతల పడేది. కాని...

కాళయ్యగారు ఒట్టి నేల మీద సాష్టాంగంగా పడుకుని ఉన్నాడు. కూర్చుందామంటే ఎడం చెయ్యి, నేలమీద ఆన్చి లేవాలి ఆన్చాలంటే పట్టు దొరకాలి దొరకాలంటే కుడిచేయి సహకరించాలి. కుడిచేయి ఏమాత్రం సడలినా, దొంగ జారిపోయేటట్టున్నాడు. పైగా ఆముదం కూడా రాసుకొచ్చాడు. వెధవ. అయినా అలాగే పడుకుని ఎడం చేయి ఆన్చి లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.



లోపలి ఈ పరిస్థితిని పసిగట్టాడు నాగన్న. నేలని ఉడుమల్లే పట్టి, ఎడంకాలు గోడకి తన్నిపెట్టి, కుడికాలు బ్రహ్మాండ భాండం బద్దలయ్యేటట్టు గుంజుకోసాగాడు.

కాళయ్యగారి కర్థమైంది. "వీడెవడో అసామాన్యుడైన గజదొంగ. అయినా ఫరవాలేదు. కొంచెం కూర్చొనడానికి పట్టు దొరికితే, కుక్క పిల్లని తోక పుచ్చుకుని లాగినట్లు లాగ్గలను వీడిని" - అనుకున్నాడు.

బయట, ఆ కాస్త పట్టూ వదిలితే సుడిగాలికి కొట్టుకుపోయే పుల్లిస్త రాకల్లే విలవిల్లాడుతున్నాడు నాగన్న.

"చచ్చావులే యివాళ నా చేతిలో వెధవ." అంటూ కాళయ్యగారు పట్టు మరింత బిగించాడు. బొటనవేలు భగ్గున మండుతోంది నాగన్నకి. ఆ మంట చల్లారడానికి

"గంగతల్లీ" అంటూ తమ ఇలవేల్పు అయిన కుమారస్వామి యొక్క తల్లిని తలుచుకుంటూ మూలుగుతున్నాడు.

అంతే! లోపల గంగమ్మగారి హృదయం ద్రవించిపోయి, స్వర్గం నుండి శివుడి నెత్తిమీదకి, అక్కడి నుంచి భూమ్మీదకి అడ్డు లేకుండా ఒక్క దూకు దూకింది.

మెల్లిగా లేచి కూర్చోబోతున్న కాళయ్యగారి ఎడంకాలి చీలమండ గట్టిగా పట్టుకుని లాగుతూ బతిమాలుతోంది "అబ్బ! వదిలేద్దురూ వెధవని! వాడిక్కడ ఛస్తే, పాపం వాడి పెళ్ళాం బిడ్డలు అక్కడ ఛస్తారు."

"ఛస్! నోరుముయ్యి! వెధవ జాలీ నువ్వూనూ?" కాళయ్యగారి గర్జన.

ఆవిడ చెయ్యి ఆయన కాలిమీద మరికాస్త బిగుసుకుంది. "అబ్బ! వాడసలే దొంగండి బాబు! ఏం కత్తులు కటార్లుంటాయో వాడి దగ్గర! మీకు పుణ్యముంటుంది వదిలేద్దురూ." ధోరణి మారుస్తూ వేలు పుచ్చుకుని లాగసాగింది మెల్లిగా.

"నీ దుంపతెగ! అసలే పట్టుదొరక్క నేను ఛస్తుంటే, నీ గోలేమిటి మధ్యలో" అంటూ బలంగా కాలు ఒక్క విదిలింపు విదిలించాడు. మామూలుగా ఆ విదిలింపుకి ఓ అడవి గుర్రమో, మదవుటేనుగో ఎగిరి అవతల పడేది కాని....

"అబ్బ! నా మాట విని యిలా రద్దురూ! అంటూ పళ్ళు బిగించి ఆ కాలు అలానే పుచ్చుకుని వెనక్కి ఒక్క గుంజు గుంజింది గంగమ్మగారు.

అంతే! ఆ ఊపుకి కాళయ్యగారు జర్రున వచ్చి ఆవిడ ఒళ్ళోపడ్డాడు!! అదే ఊపులో అటు నాగన్న సర్రునపోయి తన గుడిసెలో పడ్డాడు!!!!

గుఱకొయ్యలు పొడిచే వేళకి చీర సర్దుకుంటూ జుట్టు ముడేసుకుంటూ, కళ్ళాపి చల్లడానికి వాకిల్లోకి వచ్చింది గంగమ్మగారు. గుమ్మంలో ఓ తట్టా; తట్టలో పట్టుచీరా, రవికలగుడ్డా, పసుపు కుంకుమలు, అరటిపళ్ళగెలా! గెలకి తగిలించిన కడియమూ చూసి, 'ఓరి పిచ్చినాగన్నా!' అని నవ్వుకుంది.